విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

బుధవారం 08 జనవరి 2025

8 పేజీలు

- హంద్రీ నీవా జలాలను జూన్ కల్లా కుప్పానికి తీసుకొస్తాం
- ధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం
- ప్రజలందరికీ న్యాయం చేయడం ముఖ్యమంత్రిగా నా బాధ్యత
- 2వ రోజు కుప్పం పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజలకు సుపరిపాలన అందించడం కోసమే...

జన నాయకుడు పోర్టల్

వార్త 2లో

శ్రీవారి భక్తులకు

10 రోజులు వైకుంఠ ద్వార దర్శనం

– టీటీడీ ఈవో జె.శ్యామలరావు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 10వ తేది నుండి 19వ తేది వరకు నిర్వహించనున్న పది రోజుల వైకుంఠద్వార దర్శనాలకు అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ ఈవో జె.శ్యామలరావు తెలియజేశారు. తిరుమలలోని అన్నమయ్య భవన్ లో మంగళవారం ఆయన వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల గురించి మీడియాకు వివరించారు. సమావేశంలోని ముఖ్యాంశాలు 10వ తేది నుండి 19వ తేది వరకు 10 రోజుల పాటు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు తెరిచి

2

18,19,20వ తేదీలలో ఫ్లెమింగో ఫెస్టివల్

ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ఘనంగా నిర్వహిద్దాం: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్

ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకునే ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 ను ఘనంగా జరుపుకుందాం

– సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ

విశాలాంధ్ర – సూళ్లూరుపేట : ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 నిర్వహణను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించు కుందామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ మరియు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సంయుక్తంగా పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం సూళ్లూరుపేట పట్టణంలోని ఎస్.కె.ఎస్.కళ్యాణ మండపం నందు ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 సమర్థవంత నిర్వ హణపై అధికారులు ప్రజా ప్రతినిధుల సమన్వయ సమా వేశం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, సూళ్లూరు పేట ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ, రీజనల్ డైరెక్టర్ ఏపీటిఎ డా.రమణ, మాజీ ఎంపి నెలవల సుబ్రమణ్యం, మాజీ ఎంఎల్సీ వాకాటి నారాయణరెడ్డి తదితరులతో కలిసి అధికారులు ప్రజా ప్రతినిధులతో

2

9న ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే...

ఇంటి స్థలాల ధర్నాను జయప్రదం చేయండి

– సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామానాయుడు

విశాలాంధ్ర-తిరుపతి : సొంత ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కొరకు తొమ్మిదవ తేదీన తిరుపతి ఆర్ డి ఓ కార్యాలయం వద్ద జరుగుతున్న సామూహిక అర్జీలు సమర్పణ మహా ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు జిల్లా కార్యదర్శి పి.మురళిలు పిలుపునిచ్చారు . మంగళవారం సాయంత్రం తిరుపతి నగర సమితి ఆధ్వర్యంలో ముఖ్యుల సమావేశం ఎన్.డి.రవి అధ్యక్షతన జరిగింది . ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానా యుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిన పట్టాల కు స్థలాలు చూపించక పోగా ఆ ప్రభుత్వం దగా చేసిందని విమర్శించారు . నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాలు మూడు సెంట్లు ఇస్తాము ఎన్నికల్లో గెలిచిందని ఎన్నికల హామీలను నిలబెట్టుకోకపోతే ఈ ప్రభుత్వానికి కూడా ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు సీపీఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యం లో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా తిరుపతి నియోజకవర్గంలో ఇల్లు లేని నిరుపేదలందరినీ సమీకరించినందుకు తొమ్మిదవ తారీఖున నిర్వహిస్తున్న అంటూ తెలిపారు ఈ ధర్నాకు సిపిఐ రాష్ట్ర కార్య దర్శి కే.రామకృష్ణ కార్యదర్శులకు సభ్యులు వారు తెలిపారు ఇల్లు లేని నిరుపేదల కోసం చేస్తున్న నిరుపేదలందరూ పెద్ద సంఖ్యలో తమ అర్జీలను

2

ధర్నాను జయప్రదం చేయండి

(మొదటి పేజీ తరువాయి) స్వయంగా తీసుకొని తిరుపతి ఆర్డీవో కార్యాలయానికి 9 గంటలకల్లా చేరుకోగలరని వారు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కే.రాధాకృష్ణ, బి.నదియా, బండి చలపతి, నగర కార్యవర్గ సభ్యులు, శాఖ కార్యదర్శులు , వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైకుంఠ ద్వార దర్శనం

(మొదటి పేజీ తరువాయి) ఉంచబడ తాయి. జనవరి 10వ తేది ఉదయం 4.30 గంటలకు ప్రోటోకాల్ దర్శనాలు ప్రారంభమవుతాయి. 8 గంటలకు సర్వ దర్శనాలు ప్రారంభమవుతాయి. జనవరి 10న వైకుంఠ ఏకాదశి నాడు ఉదయం 9 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు స్వర్ణరథంపై ఆలయ నాలుగుమాడ వీధులలో భక్తులకు దర్శనమిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి 4 గంటల వరకు మలయ ప్పస్వామి వాహన మండపంలో భక్తులకు దర్శనమిస్తారు. జనవరి 11న వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 5.30 నుండి 6.30 గంటల వరకు చక్రస్నానం నిర్వహిస్తాం. సర్వ దర్శన టోకెన్లు తిరుపతిలోని 8 కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 90 కౌంటర్లలో, తిరుమలలో ఏర్పాటు చేసిన ఒక కేంద్రంలోని 4 కౌంటర్లలో ఎస్ ఎస్ డిటోకెన్లు జారీ. జనవరి 9వతేది ఉదయం 5 గంటలకు 10, 11, 12 తేదీలకు సంబంధించి 1.20 లక్షల టోకెన్లను భక్తులకు కేటాయింపు. 13వ తేది నుండి 19వ తేది వరకు ఏరోజుకారోజు టోకెన్లు జారీ. సామాన్య భక్తులకు పెద్ద పీఠ వేస్తూ పదిరోజులకు గాను 4.32 లక్షల ఎస్ఎస్ డీ టోకెన్ల జారీ.తిరుపతిలోని ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణు నివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, భైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిరుమల వాసులకు బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎస్ఎస్ డీ టోకెన్లు జారీ.ఇప్పటికే పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి 1.40 లక్షల ఎస్ ఈ డి టికెట్లను, 19500 శ్రీవాణి టికెట్లను ఆన్ లైన్ లో విడుదల.ప్రోటోకాల్ ప్రముఖులకు మినిహా వీఐపీ బ్రేక్, వృద్ధులు, చంటిపిల్లలు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ, ఇతర దర్శనాలు పది రోజుల పాటు రద్దు.తిరుమలలో వసతి గదులు తక్కువగా ఉన్న కారణంగా దర్శన టోకెన్లు కలిగిన భక్తులను మాత్రమే క్యూలైన్లలోకి అనుమతి. భక్తులు క్యూలైన్లలో వేచి ఉండే సమయాన్ని నివారించేందుకు తమకు కేటాయించిన తేది, సమయానికే దర్శనానికి రావాలని విజ్ఞప్తి. దాదాపు 7 లక్షల మందికి పైగా వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకునేందుకు ఏర్పాట్లు.జనవరి 9వ తేదిన అదేరోజు శ్రీవారి దర్శనానికి సంబంధించి తిరుపతిలో ఇచ్చే ఎస్ఎస్ డీ టోకెన్లు జారీ నిలిపివేత.శ్రీవారి మెట్టు మార్గంలోని టోకెన్ జారీ కౌంటర్లు జనవరి 19వ తేది వరకు మూసివేతఎక్కువమంది సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు ఈ పదిరోజులు సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. వసతి పది రోజుల పాటు తిరుమలలో వసతి గదుల ఆన్ లైన్ బుకింగ్ రద్దు. సామాన్య భక్తులకు సీఆర్వోలో వసతి గదుల కేటాయింపు. 8వ తేది నుండి 11వ తేది వరకు 4 రోజుల పాటు తిరుమలలోని ఎం బి సి, ఏ ఆర్ పి, టిబిసి, కాటేజ్ డోనార్ స్కీమ్ అలాట్మెంట్ కౌంటర్లు మూసివేత. ట్రాఫిక్ తిరుమలలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా దాదాపు 12 వేల వాహనాలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు. యంబీసీ, ఔటర్ రింగ్ రోడ్ , రామ్ భగీచా ఏరియా, పరకామణి భవనం, అర్చక నిలయం సమీపంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు.టికెట్లపై ఎంట్రీ పాయింట్, అలైటింగ్ పాయింట్, పార్కింగ్ పాయింట్, పికప్ పాయింట్ వివరాలు ముద్రణ. ఆ వివరాల మేరకు తమకు కేటాయించిన సమయానికే వాహనాల్లో రావాలని భక్తులకు విజ్ఞప్తి. భద్రతా ఏర్పాట్లు తిరుపతిలో సర్వ దర్శన టోకెన్ల జారీ కేంద్రాల్లో, తిరుమలలో భక్తులకు ఇబ్బంది లేకుండా దాదాపు 3వేల మంది పోలీసులు, 1550 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బంది తో పటిష్ట భద్రతా ఏర్పాట్లు. తిరుమలలో 2770 సీసీ కెమెరాలు, తిరుమల తిరుపతి ఎస్ ఎస్ డి కౌంటర్లలో అదనంగా 50 కెమెరాలతో భద్రతా పర్యవేక్షణ. అన్న ప్రసాదాలు భక్తులకు ఉదయం 6 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు నిరంతరాయంగా మంచినీరు, అన్న ప్రసాదాలు పంపిణీ. అన్న ప్రసాద కేంద్రాలతో, ఫుడ్ కౌంటర్లు ద్వారా అన్న ప్రసాదాలు పంపిణీ. సాంబారన్నం, పాలు, టీ, స్నాక్స్, మంచి నీరు పంపిణీ. అలంకరణవిద్యుత్, పుష్పాలంకరణపై ప్రత్యేక దృష్టి. మైసూర్ దసరా ఉత్సవాల్లో విద్యుత్ అలంకరణ చేపట్టే నిపుణులతో ఈ ఏడాది ప్రత్యేక విద్యుత్ అలంకరణ. పౌరాణిక పాత్రలతో పుష్పాలంకరణ. క్యూలైన్ల నిర్వహణ క్యూలైన్ల నిర్వహణకు దాదాపు 3వేల మంది యువ శ్రీవారి సేవకులు, ఎన్ సి సి, స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవల వినియోగం. పారిశుద్ధ్యం తిరుమలలో పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి. ఈ పదిరోజులకు గాను 2082 మందికి అదనంగా 150 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఏర్పాటు. ముఖ్యమైన ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగింపు. తిరుమలలోని రోడ్లన్ని పరిశుభ్రంగా ఉండేలా చర్యలు. ప్రచార విభాగం టీటీడీ సమాచార కేంద్రాలు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, ఎస్వీబీసీ నాలుగు చానళ్లు, ఎస్వీబీసీ రేడియో, ఆల్ ఇండియా రేడియో, టీటీడీ వెబ్ సైట్స్, టీటీడీ సోషియల్ మీడియా, టీటీడీ బ్రాడ్ కాస్టింగ్ విభాగం ద్వారా విస్తృత ప్రచారం. భక్తులకు సమాచారం తెలిపేందుకు వీలుగా విరివిగా సూచిక బోర్డులు ఏర్పాటు. భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించిన ఎస్ఎస్ డీ టోకెన్లు జారీ చేసే కౌంటర్ల వద్ద గూగుల్ లొకేషన్ మ్యాప్స్ ఏర్పాటు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి వీరబ్రహ్మం, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కథనంపై స్పందించిన డిప్యూటి డిఈవో

విశాలాంధ్ర - చంద్రగిరి: తీరుమారని డొక్కా సీతమ్మ పథకం, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం, పిల్లల ఆరోగ్యంతో టీచర్లు ఆటలు- పిల్లలు తంటాలు పేరుతో సోషల్ మీడియాలో వచ్చిన వార్తకు స్పందించిన డిప్యూటీ డిఇఒ బాలాజి మంగళవారం ఉదయం చంద్రగిరి జడ్పి ఉన్నత బాలికల పాఠశాలను సందర్శించారు. ప్రధానోపాధ్యాయులు వంట మనుషులతో విచారణ చేపట్టారు. పాఠశాల విద్యార్థినులకు వడ్డిస్తున్న అన్నంలో లోపాలు లేవని నాణ్యత ప్రమాణాలతోనే సిబ్బంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నట్లు గుర్తించారు. శనివారం సుమారు 1200 మందికి మధ్యాహ్నం భోజనం తయారు చేసిన నాలుగు పాత్రలలోని ఓ పాత్రలోని అన్నం తిన్న కారణంగానే విద్యార్థినులు అస్వస్థకు గురైనారని అస్వస్థతకు గురైన విద్యార్థినులు అందరూ ఆసుపత్రి నుంచి క్షేమంగా డిస్చార్జ్ అయ్యి ఆరోగ్యంగా ఉంటున్నారన్నారు. ఇకపై అలాంటి సంఘటన జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సంఘటనకు కారకులైన వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మంగళవారం నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు డొక్కా సీతమ్మ పథకం పేరుతో అమలపరుస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. మండల విద్యాధికారి-2 భాస్కర్ బాబు, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్

(మొదటి పేజీ తరువాయి) సమన్వయ సమావేశం నిర్వహించి ఫ్లెమింగో ఫెస్టివల్ ఘనంగా నిర్వహణకు చేపట్టాల్సిన పలు అంశాలపై పలువురి సూచనలు, సలహాలు తీసుకుని అధికా రులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2020 సంవత్సరం వరకు ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రతి సంవత్సరం నిర్వహించి ఉన్నారని, గత నాలుగు సంవత్సరాలుగా ఈ ఫ్లెమింగో ఫెస్టివల్ ను నిర్వహించడం జరగలేదని, ప్రస్తుత మన గౌరవ ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 ను ఘనంగా రాష్ట్ర పండుగ రీతిలో నిర్వహించాలని సూచించారని తెలిపారు. మన జిల్లాలో ఫ్లెమింగో ఫెస్టివల్ జనవరి 18,19 మరియు 20 తేదీలలో మూడు రోజులపాటు ఐదు ప్రాంతాలలో నేలపట్టు, బి.వి పాలెం, అటకానితిప్ప, శ్రీ సిటీ, సూళ్లూరుపేట నందు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఏర్పాట్లలో ఏలాంటి లోటుపాట్లు ఉండరాదని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నేలపట్టు పక్షుల అభయారణ్యం నందు ఉన్న విలక్షణ, పర్యావరణ వైవిధ్యం కారణంగా గ్రేపెలికాన్ పక్షులు, కార్మోనెట్ బిల్ పక్షులు(నీటి కాకులు), స్పూన్ బిల్ స్టాక్ పక్షులు, ఓపెన్ బిల్ స్టాక్ పక్షులు తదితర అరుదైన పక్షులు నేలపట్టు అభయారణ్యానికి ఆలవాలమని తెలిపారు. వలస పక్షులు సౌత్ ఈస్ట్ ఆసియా సుదూర విదేశీ ప్రాంతాల నుండి వచ్చి వాటి సంతతిని పెంపొందించుకొని తిరిగి స్వంత ప్రాంతాలకి వెళ్తాయని, అలాగే ఫ్లెమింగో పక్షులు ఆహారం కొరకు వలస వచ్చి స్వంత ప్రాంతాలకి తిరిగి వెళ్ళిపోతాయని అన్నారు. ఈ విలక్షణ పక్షులను సందర్శిం చడానికి, విజ్ఞానాన్ని పెంపొందించుకొనడానికి వీలుగా నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం నందు విలక్షణ పెలికాన్ పక్షుల వీక్షణ, అటకానితిప్ప పులికాట్ పక్షుల రక్షిత కేంద్రం వీక్షణ పాయింట్ల నందు ఫ్లెమింగో పక్షుల వీక్షణ ఏర్పాటు, బీవీపాలెం నందు బోటింగ్ ఏర్పాటు, శ్రీసిటీ నందు పర్యావరణ వైవిధ్య అంశాలపై ఎకో ఫ్రెండ్లీ బయో డైవర్సిటీ అంశాలపై పలువురు నిష్ణాతులతో మేథో మథన సదస్సులు 3 రోజులు నిర్వహించి తద్వారా ఒక మంచి ప్రణాళిక తయారీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పలు స్టాల్ లు ఏర్పాటుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 ను ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 200 రకాల పైగా పక్షులు వస్తాయని తెలిపారు. అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. అటవీ శాఖ, పర్యాటక శాఖ, శ్రీసిటీ తదితర ఇన్స్టిట్యూషన్ లు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ఈ కార్యక్రమ నిర్వహణకి చర్యలు చేపడుతున్నామని అన్నారు. అధికారులు ఎంతో బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. పెద్ద ఎత్తున పర్యాటకులు ఇతర రాష్ట్రాల నుండి కూడా వస్తారని తెలిపారు. ఈ ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రాంతాల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు అనుసంధానం చేసి ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ పనులు మంజూరు చేశామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం తో పాటు పర్యాటక రంగం కూడా అభివృద్ధికి మన జిల్లాలో పలు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సదరు ఫ్లెమింగో ఫెస్టివల్ కార్యక్రమాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ ప్రాంతాలు ఎకో సెన్సిటివ్ జోన్ లో ఉన్నాయని, అక్కడి ప్రజలకు కొన్ని సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి నిబంధనలకు లోబడి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ఈనెల 18,19మరియు 20 తేదీలలో ఫ్లెమింగో ఫెస్టివల్ ను ఘనంగా అందరు అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ గారు ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహణ ఏర్పాట్లపై క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు సూచనలు ఇస్తున్నారని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మీడియా తదితర వర్గాల వారి సహకారంతో ఘనంగా నిర్వహించు కోనున్నామని తెలిపారు. అంతకు మునుపు జూనియర్ కళాశాల ప్రాంగణంలో కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ హెచ్ఎం పీవి వైరస్ అంత ప్రమాదకరమైన వైరస్ కాదని, భయపడాల్సిన అవసరం లేదని, కరోనా సమయంలో తీసుకున్న ప్రివెంటివ్ చర్యలు తీసుకుంటే చాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డి టూరిజం డా.రమణ ప్రసాద్, డిఎఫ్ఓ వైల్డ్ లైఫ్ మేనేజ్మెంట్ రాధిక, జిల్లా పర్యటక శాఖ అధికారి జనార్దన్ రెడ్డి, డివిఎం శ్రీనివాస రావు, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు కలిసి పాల్గొన్నారు..!

ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులకు

కనీస వేతనం ఇవ్వాలి

-తిరుపతి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు ప్రదీప్ కుమార్

విశాలాంధ్ర-తొట్టంబేడు: ప్రభుత్వ శాఖల్లో ఒప్పంద, పొరుగు సేవల ప్రాతిపదికన పని చేసే ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వాలని ఆ యూనియన్ తిరుపతి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు ప్రదీప్ కుమార్ డిమాండు చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6వ తేదీన విడుదల చేసిన జీవో నంబరు:2ను సవరించి అందరికీ కనీస వేతనం అమలు చేయాలని ఆయన కోరారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి 'సమాన పనికి సమాన వేతనం' ఇవ్వాలన్నారు. జీవో నంబరు:2 వలన ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల మధ్య వేతనాల విషయంలో తీవ్ర అసమానతలు ఏర్పడతాయని ప్రదీప్ కుమార్ అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను అనుసరించి... సమాన పనికి సమాన వేతనం కల్పించడం అవసరమన్నారు. అనేక పోరాటాలతో ఉమ్మడి రాష్ట్రంలో సాధించుకున్న మినిమం టైంస్కేలు కు తిలోదకాలు ఇస్తూ గత ప్రభుత్వం జీవో నంబరు: 7ను విడుదల చేసిందన్నారు. ఈ జీవోను మార్చాలని ఆయన కోరుకున్నారు. తమది భిన్నమైన ప్రభుత్వం అని చెబుతున్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన అన్యాయాన్నే కొనసాగిస్తూ మరలా ఈ జీవోను జారీచెయ్యడం అన్యాయమన్నారు. ప్రస్తుతం నిత్యావసర ధరలు దృష్ట్యా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలల్లో ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులకు మెరుగైన వేతనాలు, సంక్షేమం కోసం నిబంధనలు, చట్టాలు తీసుకువస్తున్న తరుణంలో ఏపీ ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. పొరుగు సేవల కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయలేమని చెప్పడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం ఆదర్శ యజమానిగా ఉండాల్సిన సమయంలో... కృత్రిమ నిబంధనల ద్వారా ఉద్యోగుల హక్కులను హరించడం, బహిరంగ శ్రమ దోపిడికి పాల్పడడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో 3లక్షల మంది ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులకు నష్టదాయకమైన జీవో నంబరు: 2ను మానవతా దృక్పథంతో సవరించాలని ప్రదీప్ కుమార్ కోరారు.

సూళ్లూరుపేటలో జనవరి 18 నుండి 20 వరకు ఫ్లెమింగో ఫెస్టివల్

కళాశాల మైదానం పరిశీలించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఫ్లెమింగో ఫెస్టివల్ ను, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ నెల 18 తేదీ నుండి 20 వ తేదీ వరకు మూడు రోజుల పాటు అటహాసంగా నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు ,ఇందులో భాగంగా సూళ్లూరుపేట పట్టణం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం ను మంగళవారం సులూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయశ్రీ, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు, జిల్లా అధికారులతో అక్కడ ఏర్పాట్లు గురించి చేర్చించారు, ఎలాంటి క్రీడలు నిర్వహించాలి,స్టాల్స్ ఎలా ఏర్పాటు చేయాలి,స్టేజి ఎలా ఉండాలి అనే అంశాల పైన చేర్చించడం జరిగింది. టూరిజం శాఖ ఆధ్వర్యంలో అటవీ శాఖ సహకారంతో ఈ ఫ్లెమింగో ఫెస్టివల్ ను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నేలపట్టు, ఆట కాని తిప్పా, పులికాట్, బీవీ పాల్యం, శ్రీ సిటీ ప్రాంతాలలో పర్యాటక స్టాల్స్ ని ఏర్పాటు చేస్తామని పర్యా టకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని అధికారులకు జిల్లా పాలనాధికారి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సులూరుపేట తాసిల్దార్ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, పర్యాటక శాఖ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఏజీ కిషోర్, మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు, భారతీయ జనతా పార్టీ నాయకులు నారాయణరెడ్డి ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డు సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర-తొట్టంబేడు: శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చొరవతో దీర్ఘకాలికంగా ఉన్న రోడ్డు సమస్యకు మంగళవారం పరిష్కారం లభించింది. దీంతో ఆ మార్గ ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తొట్టంబేడు మండలం పూడి-ఇలగనూరు మధ్య రోడ్డు నిర్మాణం చేయాలని చాలా కాలంగా ప్రతిపాదన ఉంది. వైసీపీ హయాంలో రాజకీయ కారణాలతో ఈ రోడ్డు చేయకుండా ఆ పార్టీ వారు అడ్డుకున్నారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులుగా బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి అయిన తరువాత ఈ సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పూడి, ఇలగనూరు గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు ఈ సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు తొట్టంబేడు రెవిన్యూ, పోలీసు శాఖల అధికారులను అక్కడకు పంపారు. ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు పాల సరఫరా సంఘం మాజీ అధ్యక్షులు రావిళ్ల మునిరాజానాయుడు కూడా అక్కడకు వెళ్లారు. పూడి, ఇలగనూరు రైతులతో చర్చించారు. రోడ్డు నిర్మాణం వలన ఉపయోగం గురించి వివరించారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే తరపున ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు రైతులు రైతులు అంగీకరించారు. దీంతో పూడి-ఇలగనూరు గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమం అయింది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కొణతనేరి, గుర్రప్పనాయుడుకండ్రిగ, పూడి,ఇలగనూరు వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీర్ఘ కాలికంగా ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించినందుకు ఆ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేశారు.

శ్రీవారి భక్తుడు శక్తిరాసన్ సైకిల్ యాత్ర

41 సంవత్సరాలుగా ఏడాదికి ఒకమారు

విశాలాంధ్ర - చంద్రగిరి: తిరుమల శ్రీవారి భక్తుడు శక్తిదాసన్ (62) తన సైకిల్ యాత్ర మారోమారు పూర్తి చేసుకుని మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. తమిళనాడు, కోయంబత్తూరు జిల్లా, కినత్తుకడవు, సింగరామ్ పాళ్యంకు చెందిన శక్తిదాసన్ (61) తిరుమల శ్రీవారి దర్శనార్ధం సైకిల్ పై వచ్చారు. ముందుగా తిరుచానూరులోని శ్రీపద్మావతీ అమ్మవారిని దర్శించుకుని రాత్రి అక్కడే బస చేశారు. వేకువఝామున తిరుమలకు కాలినడరన బయలుదేరి వెళ్ళి స్వామి వారిని దర్శించుకుని తిరిగి రాత్రికి తిరుచానూరు చేరుకున్నారు. మరో మారు అమ్మవారిని దర్శించుకున్న ఆయన తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో చంద్రగిరి బైపాస్ రోడ్డులోని నాగాలమ్మ ఆలయం వద్ద అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 41వ సంవత్సరం సైకిల్ పై 400 కిలో మీటర్లుకు పైగా ప్రయాణించి స్వామి వారిని దర్శించుకుని తిరిగి వెళుతున్నట్లు తెలిపారు. స్వామిజీ సుదూర ప్రయాణం పైగా సైకిల్ తొక్కుకుంటూ రావడం కష్టం కదా అని ప్రశ్నిస్తే తిరుమల శ్రీవారి పట్ల తనకున్న భక్తి ఆ కష్టాన్ని దూరం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో 1986 అక్టోబర్ 16 నుండి 56 రోజుల పాటు కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు అక్కడి నుండి తిరిగి తమిళ నాడులోని సేలం వరకు సైకిల్ పై ఆధ్మాత్మిక యాత్ర విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

చంద్రబాబును కలిసిన టిడిపి మైనార్టీ నాయకులు

విశాలాంధ్ర - పుంగనూరు: కుప్పం పర్యటనలో ఉన్న రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ను పుంగనూరు టిడిపి మైనార్టీ నాయకులు సయ్యద్ సుహేల్ భాష బృందం కలవడం జరిగింది. ఈ సందర్భంగా నియోజవర్గంలో జరుగు తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఆయనకు వివరించారు. అదేవిధంగా పార్టీ సభ్యత్వ నమోదులో మైనార్టీల పాత్ర గురించి ఆయన కు వివరించడం జరిగింది. ముఖ్యంగా నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డికి ఉన్నత పదవి ఇచ్చి నియోజకవర్గ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని ఆయనను మైనార్టీ నాయకులు కోరడం జరిగింది అంతేగాక గతంలో వైయస్సార్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాపై పెట్టిన అక్రమ కేసులను తొలగించాలని వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని నారా చంద్రబాబు నాయుడును వారు కోరారు. ఈ కార్యక్రమంలో సద్దాం హుస్సేన్ నదీమ్ అస్లాం అన్ను అబ్దుల్ షబ్బీర్ పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో సమస్యలు పరిష్కరించుకోండి

విశాలాంధ్ర - పుంగనూరు: రెవిన్యూ సదస్సులో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి పిలుపునివ్వడం జరిగింది ఆయన మండలంలోని మాగండ్లపల్లి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులు పాల్గొని రైతుల నుండి అర్జీలను స్వీకరించివాటినిపరిష్కరించాలని అధికారులను ఆదేశించడం జరిగింది.

బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు పూజలు

విశాలాంధ్ర - కార్వేటినగరం : కార్వేటి నగరంలోని గ్రామదేవత శ్రీ బంగారమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిం చారు. ఈ సందర్భంగా వివిధ పరిసర గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు మహిళా భక్తులు పొంగల్లు పెట్టి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అమ్మవారి తీర్ధ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కే ప్రసాద్, ఉపాధ్యక్షులు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

శ్రీ అంకాలమ్మ ఆలయంలో అన్నదానం

విశాలాంధ్ర-రేణిగుంట: రేణిగుంట మండలం రామకృష్ణాపురం గ్రామంలోని మహిళలు ఓం శక్తి మాల ధారణ చేసి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలిచి మంగళవారం ఇరుముడి ధరించి తమిళ నాడులోని మేల్మరవత్తూర్ బయలుదేరి వెళ్లారు. గ్రామంలోని వేలసిన శ్రీ అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాల ధారణ చేసిన మహిళలు పంబజోడుల దరువులకు ఓం శక్తి పరాశక్తి అంటూ నృత్యాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. గ్రామం నుంచి ప్రతి సంవత్సరం ఓం శక్తి మాల ధారణ చేసి అమ్మవారి దర్శనానికి వెళుతున్నామని వారు అన్నారు. ఆలయ పూజారి మునస్వామి,గురుశక్తిలు కవిత, సుశీలమ్మ,కాంతమ్మ,అమరమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జిల్లా స్థాయి గుర్తింపు

- అభినందించిన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : గ్రామీణ విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా స్థాయి గుర్తింపు రావడంతో విద్యాశాఖ, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రశంసించారు. బి.ఎన్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థులు జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు జి గౌరీ ప్రతిభ తో తయారుచేసిన రైన్ వాటర్ హార్వెస్ట్ ఇన్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్ట్ జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన గ్రూపు విభాగంలో తృతీయ స్థానం సాధించింది. తిరుపతి డీఈవో కె వి ఎన్ కుమార్, పుత్తూరు డి.వై.ఈ.వో హెచ్ ప్రభాకర్ రాజు, విద్యార్థిలు ఎం.చరిత ,ఎం.హారిక లకు ప్రశంసా పత్రాలు జ్ఞాపకను అందజేశారు. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.రమణయ్య, రెండవ మండల విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం,లు విద్యార్థులు అభినందించారు.

క్రీడల పట్ల యువత ఆసక్తి పెంచుకోవాలి

- తలపా దామోదరం రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరంరెడ్డి సూచిం చారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని బృందావనం కాలనీలోని యువతకు మంగళవారం ఆయన వాలీ బాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన యువతకు క్రీడల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఎంతో అవసరం అన్నారు. యువత చెడు మార్గం పట్టకుండా మంచి అలవాట్లు వైపు నడవడానికి క్రీడలు ఎంత దోహదం చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల మక్కువ పెంచుకొని... వాటిలో పాల్గొనాలని తలపా దామోదరం రెడ్డి కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంటోనీ, చందు, శంకర్, నాగరాజు, అరుణ్, చంద్రు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయండి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం రామాపురం పంచాయతీ భగ త్ సింగ్ కాలనీ వాసులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి మించల శివకు మార్ విజ్ఞప్తి చేశారు. రామాపురంలో మంగళవారం రెవిన్యూ సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మించల శివకుమార్ మండల తహసీల్దారు లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఇంటి పట్టాలు లేకపోవడంతో భగత్ సింగ్ కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడుతు న్నారని ఆయన అధికారులకు వివరించారు. ఈ సమస్యపై పలు పర్యాయాలు అధికారు లకు వినతి పత్రాలు అందజేసినా స్పందించడం లేదన్నారు. ఇకనైనా భగత్ సింగ్ కాలనీ వాసు లకు ఇంటి పట్టాలు మంజూరు చేసి సాయం చేయాలని శివకుమార్ విజ్ఞప్తి చేశారు.

పంచాయితీలలో వీధిలైట్లు ఏర్పాటు : ఎంపీడీవో

విశాలాంధ్ర - కార్వేటినగరం : మండలంలోని ప్రతి పంచాయతీలో సంక్రాంతి భోగి సందర్భంగా అన్ని గ్రామాలలోవీధిలైట్లు మండేలా చూడాలనికార్యదర్శిలను ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రతి పంచాయతీ లో మరమతుల గురైన బలుపులన్నీ మండేలా చర్యలు తీసుకున్నారు. కొన్ని పంచాయతీల్లో వీధిలైట్లు పనులను కార్యదర్శులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పంచాయతీలో పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

సైన్స్ సింపోసియంను ప్రారంభించిన ఎమ్మెల్యే.

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఆంగ్ల మాధ్యమ పాఠశాల నందు సైన్స్ సింపోసియం ను గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచం అంతా సైన్స్ ఆవశ్యకతను గుర్తించి, సైన్స్ పరిశోధనలో అనేక వస్తువులను సృష్టించి మానవ జీవితంను ప్రభావితం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలలో ప్రతిఒక్కరు పాల్గొని విద్యార్థుల అభ్యుదయానికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాం డెంట్ నవకోటి నాయుడు, అకాడమిక్ డీన్ సునీల్‌రాజ్, అకాడమిక్ కోఆర్డినేటర్ హరికృష్ణ, ప్రైమరీ ఇన్ చార్జి సింధు, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు మరియు వివిధ ప్రాంత పాఠశాలల విద్యార్థులు వారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేద్దాం :సిడిపిఓ

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేయడానికి ఇది సమయమని ఐసిడిఎస్ సత్యవేడు ప్రాజెక్టు సిడిపిఓ రెడ్డి దేవ కుమారి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం ఎంపీడీవో త్రివిక్రమ రావు అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడి కార్యకర్తలు, ఏఎన్ఎం లు, ఎం.ఎస్.కె లు , వెల్ఫేర్ అసిస్టెంట్లు, నోడల్ టీచర్, నోడల్ లెక్చరర్స్ కు ఆరోగ్యం, ఆహారం, విద్య, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ సి.డి.పి.ఓ రెడ్డి దేవ కుమారి మాట్లాడుతూ బాలికల బంగారు భవిష్యత్తు ఉజ్వలకరంగ ఉండాలంటే ఆరోగ్యం, ఆహారం, విద్య, అందించాలన్నారు, బాల్య వివాహాల నిర్మూలనకు మనందరం సమిష్టి కృషితో పనిచేయాలన్నారు.ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచడానికి ఇది మంచి అవకాశమన్నారు. ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకొనేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి వచ్చిన అంగన్వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, ఎం.ఎస్.కె, వెల్ఫేర్ అసిస్టెంట్, నోడల్ టీచర్, నోడల్ లెక్చరర్, లు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో సేవలందించాలన్నారు, ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం, ఎస్సై విశ్వనాథ నాయుడు, వెలుగు సమైక్య ఏపిఎం మునెయ్య, అంగన్వాడి సూపర్వైజర్ కిన్నెర యమున, గంధం జ్యోతి, ప్రజా ప్రగతి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సుబ్రహ్మణ్యం. ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన విద్యార్థులు

విశాలాంధ్ర - గూడూరు :ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకువచ్చిన సందర్భంగా గూడూరు పట్టణం లోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పాలాభి షేకం నిర్వహించారు. టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఎన్డిఏ వచ్చిన తర్వాత విద్యారంగంలో అనేక మార్పులు వచ్చాయని రాబోయే రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారని తెలిపారు ఈ కార్యక్రమంలో లల్లు యాదవ్ ,జీవన్, ధనుష్, జయ ,జగదీష్ ,వినయ్ పాల్గొన్నారు .

వైష్ణవి మాతకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని పుదీపట్ల గ్రామంలో వెలసి ఉన్న వైష్ణవి మాతకు మంగళవారం ప్రత్యేక అలంకరణలో అర్చకులు శ్రావణి వినోద్ కుమార్ దర్శనం కల్పించారు చుట్టుపక్కల గ్రామ ప్రజలే కాకుండా పుంగనూరు పెద్దపంజాణి మదనపల్లి కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా అమ్మవారి దర్శనం కోసం అధిక సంఖ్యలో మహిళలు ముడుపులతో అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్నారు భక్తులకు ఏ ఇబ్బంది కలగకుండా త్రాగునీరు తీర్థప్రసాదాలు అందజేస్తున్నారు.

ఎమ్మెల్యే బొజ్జల చొరవతో లో-ఓల్టేజీ సమస్య పరిష్కారం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : గత కొంత కాలంగా లో ఓల్టేజి సమస్యతో బాధపడుతున్న ఆ కాలనీ వాసులకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి చొరవతో సమస్య పరిష్కారం అయ్యింది. శ్రీకాళహస్తి పట్టణంలోని బంగారమ్మ గుడి కాలనీ కైలాసగిరి కాలనీ నందు నెలకొంటున్న లో ఓల్టేజి సమస్యను పరిష్కరించండి అంటూ కైలాసగిరి కాలనీ వాసులు విద్యుత్‌శాఖ అధికారులకు ఎన్నో సార్లు మొరపెట్టుకున్నారు. కానీ ఫలితం లేకుండా పోయింది. శ్రీకాళహస్తి పట్టణంలోని బంగారమ్మ గుడి కాలనీ కైలాసగిరి కాలనీ ప్రజలు వోల్టేజ్ విద్యుత్ కారణంగా ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. దీనివలన ఇంట్లో లైట్లు వెలగకపోవడం, ఫ్యాన్లు తిరగకపోవడం చాలా ఇబ్బందులు పడేవారు. విద్యుత్ వినియోగం పెరగడంతో అక్కడ లో ఓల్టేజీ సమస్య బాగా పెరిందని, దీంతో ఇళ్లలోని విద్యుత్ ఉపకరణాలు కొన్ని కాలిపోతుండగా, మరి కొన్ని అసలు పనిచేయడం లేదని స్థానికులు వాపోయారు. ఈ సమస్యను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని కోరగా ఎమ్మెల్యే తక్షణమే స్పందించి మంగళవారం విద్యుత్ అధికారులతో మాట్లాడి 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్, కరెంటు పోల్స్ నాటించి అక్కడ లైన్ లాగారు. దీంతో బంగారమ్మ గుడి కాలనీ కైలాసగిరి కాలనీ నందు నెలకొన్న సమస్య పరిష్కారం అయ్యింది. అక్కడ స్థానికులు మాట్లాడుతూ తమ సమస్యను ఎంతో మంది అధికారులతో మొరపెట్టుకున్నా ఇంతవరకు ఎవరు పట్టించుకోలేదని, కనీసం వచ్చి చూడనూ లేదు అని వాపోయారు. సమస్యను చెప్పిన వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు.

వెంకన్నకు బంగారు అభరణాలు

భక్తులకు అన్నదానం

లక్కమనేని సన్నిహితులు జైపూర్ వాసుల భక్తి భావం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే శ్రీవెంకటేశ్వరస్వామివారికి త్వరలో బంగారు అభరణాలను కానుకగా ఇవ్వనున్నట్లు జైపూర్ వాసులు తెలిపారు. రెండు కేజీల బరువున్న ఈ అభరణాల విలువ రెండు కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని చెప్పారు. శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ నాయకులు లక్కమనేని మధుబాబుకు జైపూర్ కు చెందిన అరవింద్ సోని అత్యంత సన్నిహితులు. వీరి మధ్య ఎప్పటి నుంచో మంచి స్నేహం, అనుబంధం కొనసాగుతోంది. మధుబాబు సూచనలతో తిరుమలేశు ని దర్శనార్థం ఇదివరకు ఇక్కడకు వచ్చిన వారికి ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేశారు. వెంకటేశ్వరుని దర్శనం చేసుకుని వెళ్లిన వారికి అనుకున్న పనులు నెరవేరాయి. ఈ విషయాన్ని మధుబాబు దృష్టికి జైపూర్ వాసులు తీసుకొచ్చి కానుకలు సమర్పించాలని చెప్పారు. అప్పుడు బంగారు అభరణాలను శ్రీవారికి కానుకగా ఇవ్వాలనే మధుబాబు సూచనలతో ఆ మేరకు నిర్ణయం తీసుకుని మళ్లీ శ్రీవారి దర్శనానికి వచ్చిన జైపూర్ వాసులు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కానుకలు ఇవ్వానికి వారి నుంచి అనుమతి తీసుకున్నారు. రెండు కేజీల బరువైన ఈ అభరణాల విలువ రెండు కోట్ల రూపాయలకుపైగా ఉంటుందని అంచనా వేశారు. వీటిలో మూలవర్ల అశ్వత్థ పత్ర హారము, ఉత్సవర్లకు సాతుబడి అయ్యే ఏనుగు గొలుసు తదితర అభరణాలు ఉన్నట్లు చెప్పారు. తర్వాత శ్రీవారి సేవలో పాల్గొని శ్రీనివాసుని దర్శించుకున్నారు. అనంతరం సుమారు 1000 మంది వెంకన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.. వెంకన్న పై వీరికున్న దైవ భక్తుని పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్కమనేని మధుబాబు, ఆయన ముఖ్య అనుచరులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-గూడూరు : గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామం లోని హరిజన వాడలో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది.రూరల్ ఎస్. ఐ.మనోజ్ కుమార్ కథనం మేరకు చెన్నూరు హరిజన వాడ కి చెందిన గున్న బుజ్జయ్య (65) మనస్థాపానికి గురై పురుగుల మందు త్రాగి సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు అని పేర్కొన్నారు. అనంతరం 108 ద్వారా స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించామని తెలిపారు. శవ పంచనామా నిమిత్తం మృత దేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కులగణన సర్వే గడువు పొడిగింపు

విశాలాంధ్ర -చిత్తూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును జనవరి 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు చిత్తూరు జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి7వ తేదీతో గడువు ముగియనుండటంతో జనవరి 12వ తేదీ వరకు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం 265 నంబరు జీవో విడుదల చేసినట్లు జిల్లా కలెక్టరు మంగళ వారము ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జనవరి 12వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన వివరాలను ఆన్లైన్ ప్రక్రియ ద్వారా జనవరి 16వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని, అనంతరం అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 20వ తేదీన వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టరు ఆదేశించారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో చోరీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలో కృష్ణారెడ్డి ఇంట్లో సోమవారం రాత్రి 72గ్రాముల బంగారం చోరీ జరిగింది. కృష్ణారెడ్డి, సుబ్బలక్ష్మి దంపతులు ఇంటికి తాళాలు వేసి వేరే ఊరికి వెళ్లారు. ఇదే అదనుగా దొంగలు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలో దాచి ఉంచిన బంగారాన్ని చోరీ చేసుకు వెళ్లారు. ఈ చోరీపై బాధితుల ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీ చేసిన వారిని త్వరలోనే పట్టుకుంటామని 1వ పట్టణ సీఐ గోపి తెలిపారు.

కానిస్టేబుల్ పరీక్షలకు 192 మంది అర్హత

విశాలాంధ్ర- చిత్తూరు: కానిస్టేబుల్ల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఏడో రోజు అభ్యర్థులకు దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలను నిర్వహిం చారు. చిత్తూర్ పోలీస్ మైదానంలో ఈ ప్రక్రియను నిర్వహించారు. మొత్తం 610 మంది అభ్యర్థులకు గాను 379 మంది హాజరయ్యారని అందులో 192 మంది రాత పరీక్షకు అర్హత సాధించినట్లు అధికారులు తెలిపారు.

మొగలి ఘాట్ లో మూడు లారీలు ఢీ

విశాలాంధ్ర -చిత్తూరు : బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్ రోడ్ లో మూడు లారీలు ఢీ కొన్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. క్రిష్ణగిరి నుంచి ఒరిస్సా కు వెళ్తున్న లారీ మొగిలి ఘాట్ రోడ్ లోకి రాగానే బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి ముందుగా వెళుతున్న మరి రెండు లారీలను ఢీకొంది. దీంతో లారీలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో కొంతసేపు ఈ ప్రాంతంలో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది.

తూతూమంత్రంగా రెవెన్యూ సదస్సులు

-ముగ్గురు లబ్దిదారులు-మూడు అర్జీలు -మండల స్థాయి అధికారుల గైర్హాజరు

విశాలాంధ్ర-వెదురుకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను పటిష్టంగా నిర్వహణ చేయలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ముందస్తుగా ఆయా గ్రామాల్లో దండోరా, తదితర ప్రసార సాధనాల ద్వారా గ్రామసభలు నిర్వహణ తారీఖులు తెలియజేయాల్సిన బాధ్యత రెవెన్యూశాఖ పై ఉంది. అయితే క్షేత్ర స్థాయిలో సరైన అవగాహన లేక గ్రామసభలు బోసి పోతున్నాయని పలువురు వాపోతున్నారు.ఉదాహరణకు మంగళ వారం మండలంలోని కెవియం అగ్రహారంలో రెవెన్యూ సదస్సుకు ఓ గ్రామ రెవెన్యూ అధికారి, సచివాలయ సర్వేయర్,అటవీ సిబ్బంది ఒకరు అంటే ముగ్గురు క్షేత్ర స్థాయి సిబ్బందితో మమ అనిపించేశారు.విశేషం ఏమంటే ముగ్గురు లబ్ధిదారులు మూడు అర్జీలు రావడం జరిగింది.మండల స్థాయి రెవెన్యూ అధికారి ఖచ్చితంగా హాజరై అర్జీలు స్వీకరించాలి.అయితే ఒక్కరూ హాజరు కాకపోవడం చూస్తే ప్రభుత్వ లక్ష్యం పై ఏపాటి బాధ్యత ఉందో అర్థం చేసుకోవచ్చు.ఇలాగే మరికొన్ని గ్రామాల్లో తూతుమంత్రంగా గ్రామసభలు పెట్టి మమ అనిపించారని ప్రచారంలో ఉంది. నిజానికి గ్రామాల నుంచి రెవెన్యూ సమస్యలపై ప్రతి సోమవారం ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా జిల్లా పాలనాధికారికి వెదురుకుప్పం మండలం నుంచి అత్యధికంగా అర్జీలు వస్తుంటాయి.అయితే గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సులను అర్జీలు రావడంలేదంటే ముందస్తు సమాచారం లేకపోవడమే అని పలువురు అంటున్నారు.రెవెన్యూ సదస్సులు నిర్వహణ ను జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలన చెయ్యాల్సివుంది.అయితే తనిఖీలు లేకపోవడం వల్లే ప్రభుత్వ లక్ష్యాన్ని మండల స్థాయిలో నీరుగారుస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.ప్రభుత్వ లాక్ష్యాన్ని నీరుగారుస్తున్న పరిస్థితి పై విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.ఏదిఏమైనా రెవెన్యూ సదస్సుల నిర్వహణ ప్రతిష్టాత్మకంగా నిర్వహించి ప్రజాసమస్యలు పరిష్కరించే విధంగా జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాల్సివుందని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

చౌడేపల్లి క్రీడల్లో పుదిపట్ల అథ్లెటిక్స్ మీట్ ప్రారంభం

విశాలాంధ్ర- చౌడేపల్లి: మండలంలోని పుదిపట్లలో కార్యక్ర మాన్ని మండల విద్యాశాఖ అధికారి కేశవరెడ్డి మరియు తిరుమలమ్మ ,పుదుపట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ కమిటీ చైర్మన్ మనోహర్ రెడ్డి , వైస్ చైర్మన్ ఉదయ్ కుమార్ రెడ్డి మరియు సుధాకర్ భోజన వసంత కల్పించినటువంటి దాతలు బాబు రెడ్డి తిరుమణ పల్లి, పుదుపట్ల బాబు రెడ్డి .వినోద్ కుమార్ రెడ్డి ప్రారంభించడం జరిగింది.ఈరోజు సగం ఈవెంట్స్ నిర్వహించడం జరిగింది.మిగిలిన ఈవెంట్స్ ని రేపటి రోజు పూర్తి చేయడం జరుగుతుంది..ఈ కార్యక్రమంలో ఆరు మండలాలకి సంబంధించిన పాఠశాలల నుండి నాలుగు వందల మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో సీనియర్ విశ్రాంతి వ్యాయామ ఉపాధ్యాయులు టి రామచంద్ర ,టి వెంకటేష్, కరుణాకర్, చిన్నప్ప, రాజేంద్ర, నితిన్, ఉమా, శారద, నీలవేణి, మృదుల మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

కిషోర్ వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర-పుత్తూరు : వడమాలపేట మండలం పరిధిలో మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం నందు కిశోరి వికాసం మండల స్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమం టీఓటి ఐసిడిఎస్ సూపర్వైజర్లు వై రోజా రమణి కె మనీల వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది.హెల్త్ ఎడ్యుకేషన్ సైకాలజిస్ట్ గుణశేఖర్ కిశోరి బాలికలు పాటించవలసిన వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత భౌతిక ఆకర్షణ హనీ ట్రాప్‌కి గురించి వివరించడం జరిగింది. పోలీసు శాఖ బాల్య వివాహాలు చట్టం,బాలల అక్రమ రవాణా, సైబర్ క్రైమ్ విషయాలపై అవగాహన కల్పించడానికి శిక్షణ ఇవ్వడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ ఎస్ జరీనా హెల్త్ డిపార్ట్మెంట్ సిహెచ్ పురుషోత్తం రెడ్డి ఎంఈఓ ఎస్ పద్మావతి ఎఎస్ఐ పోలీసు శాఖ ఏపిఎం మునికృష్ణ రెడ్డి ఈఓఆర్‌డి దయాసాగర్ మరియు ఎంపీపీ. పాఠశాల.ఉపాధ్యాయులు,సచివాలయం జిఎంకేఎస్ డబ్ల్యూ ఏ ఏఎన్ఎం వివో లీడర్లు,అంగన్వాడి కార్యకర్తలు తదితరులు.పాల్గొన్నారు.

రైతుల ఆశాజ్యోతి చంద్రబాబు నాయుడు

-మాజీ ఆయకట్టు ప్రెసిడెంట్ రమేష్ నాయుడు

విశాలాంధ్ర-పెళ్లకూరు: రైతుల ఆశాజ్యోతి చంద్రబాబు నాయుడు అని టిడిపి నాయకులు మాజీ ఆయకట్టు ప్రెసిడెంట్ రమేష్ నాయుడు తెలియజేశారు. మంగళవారం పెళ్లకూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రతిష్టంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని నారా చంద్రబాబు నాయుడు రైతుల వద్దకే అధికారులు వెళ్లి వారి సమస్యను పరిష్కరించే విధంగా చూడాలని ఆదేశించడం జరిగింది. రైతుల కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర పలికి వారికి ఎంతగానో తోడు సహకారాలు ఉంటాయని రైతు సుఖీభవ అనే పథకం కూడా త్వరలోనే తీసుకువస్తాడని ఆయన తెలియజేశారు. రెవెన్యూ సదస్సు తాసిల్దార్ ద్వారకానాథ్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా సాగిందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంతోష్ బాయ్, వీఆర్వో వంశీకృష్ణ, నూతల పాట్టి ప్రసాద్ నాయుడు, రాధా నాయుడు, అధికారులు ,రైతులు పాల్గొనడం జరిగింది.

ఆశాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

-కనీస వేతనం ఇవ్వాలి - ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర- కార్వేటినగరం :ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జాతీయ సమితి పిలుపులో భాగంగా స్కీం వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని పిలుపునిచ్చిన సందర్భంగా ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్వేటినగరం మండలం లోని కత్తిరపల్లి పీహెచ్సీలో ఆశడే సందర్భంగా వైద్యాధికార్లు డాక్టర్ భువనేశ్వర్లికు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు అరుణ నాగేశ్వరి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా కూటమి ప్రభుత్వం ఆశాలకు వేతనాలు పెంచాలని ఉద్యోగానికి భద్రత కల్పించాలని ఆశాల సమస్యలన్నింటినీ పరీక్ష పరిష్కరించాలని కోరుతూ లేని పక్షంలో భవిష్యత్తులో ఏఐటియుసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని అందుకు ఆశా కార్యకర్తలు సంసిద్ధత ఉండాలని పిలుపునిచ్చారు. మేము గత 18 సంవత్సరాలుగా గర్భవతులకు, బాలింతలకు, నవజాత శిశువులకు సేవలు అందిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలను, ఆరోగ్య సూత్రాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి సర్వేల రూపంలో తీసుకెళ్లి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక భూమిక పోషిస్తున్న ఆశా కార్యకర్తల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు 26 వేల కు పెంచాలని, అధికారులు ఆశాలకు కేటాయించిన పనులనే చేపించాలని ,ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇచ్చి ప్రతి నెల పెన్షన్ 10 వేలు రూపాయలు ఇవ్వాలని 10 లక్షల ఉచిత ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, సాధారణ సెలవులు ,వేతనముతో కూడిన మేటర్నిటీ సెలవులు ఇవ్వాలని, రికార్డులను ప్రభుత్వం సరఫరా చేయాలని, ఆశాలకు సంబంధం లేని రక్త పరీక్ష ,గల్ల పరీక్ష ,గల్ల సేకరణ పనులు చేయించరాదని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు అన్నారు. ఆశాలా సమస్యల పైన రాష్ట్రవ్యాప్తంగా మరోమారు ఉధృతమైన ఉద్యమాన్ని చేపట్టాల్సింది వస్తుందని తెలిపారు. . ఈ సమావేశంలో ఏ ఐ టి యు సి గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ నాయకులు గోవిందస్వామి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అరుణ నాగేశ్వరి నాయకులు వీణ మంజుల దుర్గా విజయ లోకేశ్వరి ఆశలు పాల్గొన్నారు.

బాలికల భవిష్యత్‌కు కిషోరి వికాస్ :సిడిపివో

విశాలాంధ్ర-పెళ్లకూరు: మండలంలో వెలుగు కార్యాలయంలో బాలికల బంగారు భవిష్యత్తుకు కిషోరి వికాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఉమామహేశ్వరి మాట్లాడుతూ కిషోరి వికాసం పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారత దిశగా వారు వేసే అడుగుకు సమిష్ఠ కృషితో చేయూతనిద్దామని ఉమామహేశ్వరి అన్నారు.ఈ సందర్భంగా ఎంఈఓ శంకరయ్య మాట్లాడుతూ ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచడానికి కిషోరి వికాసం మంచి అవకాశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల ఎన్జీవోల సమన్మయంతో కార్యక్రమం పునః ప్రారంభమైందన్నారు.11-18 ఏళ్ల బాలికలకు విద్య,ఆరోగ్యం,భద్రత,ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఇందుకు ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతోపాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. డిజిటల్ భద్రత, సైబర్ క్రైమ్, ఆన్లైన్ వేదికలపై జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించమన్నారు.ఈ కార్యక్రమంలో గ్రోట్టిప్రోలు పి.హెచ్.సి వైద్య అధికారి వికాస్, ఐసీడీస్ సూపెర్వైసర్ సాయి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా సంఘంలో పుత్తూరు అధ్యాపకులు

విశాలాంధ్ర-పుత్తూరు : ప్రభుత్వ డిగ్రీ అధ్యాపక సంఘం తిరుపతి జిల్లా ఎన్నికలు ఆదివారం తిరుపతిలో జరిగాయి. నూతనంగా తిరుపతి జిల్లా ఏర్పడిన తరువాత తొలిసారిగా జరిగిన ఈ ఎన్నికలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు తగిన ప్రాతినిధ్యం లభించింది కళాశాల ఎకనామిక్స్ అధ్యాపకులైన టి. నరసింహులు తిరుపతి జిల్లా అధ్యక్షులు గా తెలుగు అధ్యాపకులు డాక్టర్ మన్యం నరసింహులు జిల్లా కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి మరియు అధ్యాపకులు యూనియన్ ఎన్నికలలో గెలుపొందిన అధ్యాపకులను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల సమస్యలను పరిష్కరించడంలో చొరవ తీసుకోవాలని అన్నారు

అర్హులైన పేదలకు నివేశ స్థలాలను మంజూరు చేయాలి

బి.కె.ఎం.యు జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి శశి కుమార్

విశాలాంధ్ర - గూడూరు :అర్హులైన పేదలకు నివేశ స్థలాలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని బి కే ఎం యు జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్ పేర్కొన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం గూడూరు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా బికెఎంయు జిల్లా కార్యదర్శి ప్రభాకర్, నియోజక వర్గ కార్యదర్శి శశి కుమార్ మాట్లాడుతూ పేదలకు రాష్ట్ర ప్రభుత్వం పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు భూమిని కేటాయించాలని పేర్కొన్నారు.అదేవిధంగా ఇంటి నిర్మాణం కొరకు ఐదు లక్షల రూపాయలను మంజూరు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అర్హులైన పేదలకు త్వరిత గతిన నివేశ స్థలాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పేర్కొన్నారు.అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వంద వినతి పత్రాలను సీపీఐ నాయకులు అందచేశారు . ఈ కార్యక్రమంలో సిఐటియు నియోజక వర్గ అధ్యక్షులు ఎంబేటి చంద్రయ్య , వెంకటయ్య, పలు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత డిమాండ్

విశాలాంధ్ర-పుత్తూరు: జాతీయ సమితి పిలుపులో భాగంగా స్కీం వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని పిలుపునిచ్చిన సందర్భంగా ఏఐటియుసి ఆధ్వర్యంలో విజయపురంలో ఆశడే సందర్భంగా వైద్యాధికారి గార్లకు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశాలకు వేతనాలు పెంచాలని ఉద్యోగానికి భద్రత కల్పించాలని ఆశాల సమస్యలన్నింటినీ పరిక్ష పరిష్కరించాలని కోరుతూ లేని పక్షంలో భవిష్యత్తులో ఏఐటియుసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని అందుకు ఆశా కార్యకర్తలు సంసిద్ధత ఉండాలని పిలుపునిచ్చారు. తాము గత 18 సంవత్సరాలుగా సేవలు అందిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలను, ఆరోగ్య సూత్రాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి సర్వేల రూపంలో తీసుకెళ్లి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక భూమిక పోషిస్తున్న ఆశా కార్యకర్తల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు 26 వేల కు పెంచాలని, అధికారులు ఆశాలకు కేటాయించిన పనులనే చేపించాలని ,ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇచ్చి ప్రతి నెల పెన్షన్ 10 వేలు రూపాయలు ఇవ్వాలని 10 లక్షల ఉచిత ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, సాధారణ సెలవులు, వేతనముతో కూడిన మెటర్నిటీ సెలవులు ఇవ్వాలని, రికార్డులను ప్రభుత్వం సరఫరా చేయాలని, ఆశాలకు సంబంధం లేని రక్త పరీక్ష, గల్ల పరీక్ష, గల్ల సేకరణ పనులు చేయించరాదని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు అన్నారు. ఆశాలా సమస్యల పైన రాష్ట్రవ్యాప్తంగా మరోమారు ఉధృతమైన ఉద్యమాన్ని చేపట్టాల్సింది వస్తుందని తెలిపారు. . ఈ సమావేశంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత, మరియు నాయకులు లత లక్ష్మీ శిభా గీత రేవతి మంజుల మరియు ఆశలు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

విశాలాంధ్ర- చిత్తూరు: జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 6 కేజీలు గంజా యిని ఒక ద్విచక్ర వాహనాన్ని రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చిత్తూరు వన్ టౌన్ సిఐ జయరామయ్య తెలిపారు. చిత్తూర్ నగరం మిట్టూరు లోని పీజేఆర్ లైన్ వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయి స్తున్నట్లు సమాచారంతో రావడంతో వెంటనే పక్కా ప్రణాళికతో దాడి చేసి గంజాయిని విక్రయించడానికి ఉన్న చిత్తూరు నగరం శంకరయ్య గుంట కు చెందిన సునీల్ కుమార్, జాన్స్ గార్డెన్‌కు చెందిన గౌస్ బాషా లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. వీరు ఒరిస్సా నుంచి గంజాయిని తీసుకొచ్చి వికరిస్తున్నట్లు గుర్తించామని వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

జిల్లాలో రెవెన్యూ సదస్సులకు 213 అర్జీలు

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: ప్రజల వద్దకు పాలనా సందర్భంగా రెవెన్యూ సదస్సులు జరుగుతున్న నేపథ్యంలో గ్రామ, మండల స్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 6 నుండి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి మంగళవారం తిరుపతి జిల్లాలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లో రెవెన్యూ, భూ సమస్యలను సులభతరంగా పరిష్కరించుకోవడానికి అనువైన వేదిక రెవెన్యూ సదస్సులు అని ఈ వేదికను మండల గ్రామ స్థాయిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కొరకు జిల్లావ్యాప్తంగా మంగళవారం నాడు 27 గ్రామ సభలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ రెవిన్యూ సదస్సులలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల రెవెన్యూ, సంబంధిత అధికారులు పాల్గొని విజయవంతంగా రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన వివిధ సమస్యలతో కూడిన దరఖాస్తులు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి చిన్న చిన్న సమస్యలు ఉన్న వాటిని అక్కడికక్కడే పరిష్కరించారన్నారు. తిరుపతి జిల్లాలో మొదటి రోజు నుండి నేటి వరకు జిల్లావ్యాప్తంగా 16310 అర్జీలు అందాయన్నారు. అర్జీల సమస్యలను కాల పరిమితి లోపల సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

శానిటేషన్ మేనేజ్మెంట్ వర్కుషాప్

విశాలాంధ్ర-చిల్లకూరు: అదాని క్రిష్ణపట్నం పోర్టు సిఎస్ ఆర్ లో భాగంగాతమ్మినపట్నం గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ వనరులు, స్వచ్ఛభారత్ మిషన్ మరియు అదాని ప్రాజెక్టు ల సమన్వయం తో గ్రామ శానిటేషన్ మేనేజ్మెంట్ పై ఒకరోజు వర్కుషాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పోర్టు సిఇవో జగదీష్ పటేల్ విచ్చేశారు. గ్రామంలో చెత్త సేకరణకు వాహనం ఏర్పాటు చేస్తామన్నారు. చెత్త సేకరణకు బుట్టలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం ,గంటా వేణుగోపాల్, కేయం రామ్ ,వెంకటేష్ భాస్కర్, రాజేష్ రంజన్, యంపీడివో , పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఎస్వీ ఆర్ కు ఘననివాళి

విశాలాంధ్ర- చిల్లకూరు: ఎస్వీ ఆర్ అకస్మిక మరణం తెలుగుదేశం పార్టీ కి తీరని లోటు అని యంయల్ ఏ పాశిం సునీల్ మంగళవారం అన్నారు. రామారెడ్డిపాళెం గ్రామంలో ని ఎస్వీఆర్ ఇంటికి మండల మరియు గూడూరు తెలుగు దేశం నాయకులతో వచ్చి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. టీడీపీ సీనియర్ నాయకులు చేవూరు విజయమోహనరెడ్డి , టీడీపీ ముఖ్య నేత తానంకి నానాజీ , మండలపార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, కడివేడు భాస్కర్ రెడ్డి, కమ్మవారిపాళెం నాయుడు మరియు టిడిపి నాయకులు అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ మండల కన్వీనర్ యద్దల మదుసూధన రెడ్డి, బల్లవోలు అమరనాథ రెడ్డి, దువ్వూరు చెంచుకిరణ్ రెడ్డి, సిపిఐ నాయకులు సిహెచ్. ప్రభాకర్, షేక్ కాలేషా , బిఎస్పీ నాయకులు భాస్కర్ గౌడ్ తదితరులు ఎస్వీఆర్ అకస్మిక మరణం పట్ల తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు.

సగంధరకే ఏవస్తువైనా పేరుతో భారీమోసం

విశాలాంధ్ర- కోట: ఏ కంపెనీ వస్తువైన సగంధరకే ఇస్తామంటూ ప్రచారం గుప్పించి మోసం చేసి పరారైన సంఘటన కోట పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సమీ పంలో ఆర్ఆర్ ట్రేడర్స్, ఆర్డర్స్ సప్లయర్ అనే పేరుతో దుకా ణాన్ని ఏర్పాటు చేసి సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఏకం పెనీ గృహోపకరణలైన సగం ధరకే ఇస్తామంటూ ప్రకటనలు గుప్పించి వ్యాపారం ప్రారంభించారు.దీంతో కోట వాకాడు చిట్టమూరు మండలాల నుండి భారీగా కొనుగోలుకు ఎగబ డ్డారు. అయితే నగదు జమ చేసిన పది రోజులు తర్వాత ఇస్తామని చెప్పారు ఈ విషయం అన్ని గ్రామాలకు పాకడంతో ప్రజలు అధికసంఖ్యలో డబ్బులు కట్టారు. ఈనెల 14వ తేదీన కొంతమంది బాధితులకు వస్తువులను అందించాల్సి ఉంది అయితే నిర్వాహకులు మంగళవారం ఉదయం నుండి షాపు తెరవకపోవడంతో పాటు వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ లో ఉండడంతో బాధితులు దుకాణ వద్దకు చేరుకుని ఆందోళన చేయటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను విచారణ జరిపి వివరాలను నమోదు చేసుకున్నారు.

సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి హఠాన్మరణం

విశాలాంధ్ర-చిల్లకూరు: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, తిరుపతి జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షులు సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి(70) సోమవారం రాత్రి తీవ్ర గుండెపోటు రావడంతో హఠాత్తుగా ప్రాణాలు కోల్పోయారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వివాహం అనంతరం ఒక కుమార్తె అమెరికా దేశంలో మరో కుమార్తె ఇంగ్లండ్ దేశంలో ఉంటున్నారు. ఎస్వీఆర్‌గా తెలుగుదేశం పార్టీలో అందరికీ సుపరిచితుడుగా ఉంటూ తాను చివరి శ్వాస తీసుకునే దాకా పార్టీకి అంకిత భా వంతో పనిచేసిన నాయకుడుగా విశేషమైన గుర్తింపు దక్కించు కున్నారు. ఎవరు ఎంతటివారు ఎంత ప్రలోభాలు పెట్టినప్పటికీ పార్టీ లోనే కొనసాగారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా స్వర్గీయ ఎన్టీఆర్ కాలం నుంచి ఇప్పటి చంద్రబాబు నాయుడు మరియు యువనేత లోకేష్ లతో పార్టీ కోసం క్రమశిక్షణతో , అంకిత భావంతో పనిచేసారు. మొదటినుంచి ఇప్పటి వరకూ పదవులకోసం ప్రాకులాడకుండా నిబద్ధతతో, నిస్వార్ధంగా పనిచేయడం తన అలవాటుగా మార్చుకొని మారిన మారుతున్న కాలంలో కూడా తాను మాత్రం ఎలాంటి అసూయ, ద్వేషాలకు గురికాకుండా చివరి వరకూ గడిపారు. ఉడతావారిపాళెం మరియు ముత్యాలపాడు యంపిటిసిగా , తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గా ప్రజలకు, పార్టీకి విశిష్ట సేవలందించారు. ఈ ధఫా తెలుగుదేశం పార్టీ చంద్రబాబు నాయుడు సారధ్యంలో ఘన విజయం సాధించడంతో గూడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి రేసులో ముందు వరసలో ఉన్నా ఎక్కడా నోరు విప్పిన సందర్భం లేకపోవడం గమనార్హం. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తో మంచి సంబంధాలను కొనసాగించారు. ఎస్వీ ఆర్ అంత్యక్రియలు బుధవారం సాయంత్రం 4 గంటలకు ఆయన సొంత ఊరు రామారెడ్డిపాళెం లో నిర్వ హిస్తారని తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మండల టిడిపి అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్ రెడ్డి పిలుపు నిచ్చారు.

సాదా బైనామాల ద్వారా కోట్ల రూపాయల అవినీతి

విశాలాంధ్ర-వెంకటగిరి: సాదా బైనామాల ద్వారా వెంకటగిరి నియోజకవర్గంలోని ప్రతి మండలంలోనూ కోట్ల రూపాయల అవినీతి జరిగినట్ల ఈ వంక చూపి అధికారులు సాధారణ ప్రజల వద్ద లక్షల రూపాయలు దండుకున్నట్లు సమాచారం కొన్ని కార్యాలయాలు నిరుపేదల భూములను దౌర్జన్యంగా వారసులు కాని వారికి సైతం అధికారులు డబ్బులు తీసుకుని వన్ బి అడంగల్ లో పేరు మార్చేసిన సందర్భాలు చాలా ఉన్నాయని కోర్టు కేసులు నడుస్తున్న వాటిని సైతం మార్చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చినాక ఇవి రద్దయినప్పటికీ కొన్ని మండలాల తాసిల్దార్లు వీఆర్వోలు నేటికీ సాదా బైనామాలు రాజకీయ నాయకుల అండదండలతో సృష్టిస్తున్నారని వీటిపై జిల్లా అధికారులు న్యాయ విచారణ జరిపించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని లేకపోతే సిపిఐ ఆధ్వర్యంలో బాధితులతో తాసిల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని సిపిఐ వెంకటగిరి నియోజకవర్గ కార్యదర్శి పల్లిపాటి బాలకృష్ణయ్య సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు.

రేపు కచ్చపి ఆడిటోరియంలో స్వయం ఉపాధి మేళా

కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర-తిరుపతి : జనవరి 9వ తేదిన కచ్చపి ఆడిటోరియంలో మెప్మా ఆధ్వర్యంలో స్వయం ఉపాధి మేళా నిర్వహించనున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ మెప్మా పరిధిలో స్వయం ఉపాధిలో భాగంగా ఆన్లైన్ బుకింగ్ ద్వారా సేవలు అందించుటకు స్వయం ఉపాధి చేయుచున్న, శిక్షణ పొందిన వారిచే స్వయం ఉపాధి మేళా నిర్వహిస్తున్నామని న్నారు. ఇందులో హెూం-అప్లయెన్సెస్ అయిన ఏసి, రిఫ్రిజిరేటర్/వాషింగ్ మిషన్ వాటర్ ప్యూరిఫైయర్, గీజర్ రిపేర్ చేయడం, వృత్తి సంబంధిత సేవలు వడ్రంగి, ప్లంబింగ్, విద్యుత్, బ్యూటీషియన్స్ సేవలు పురుషులకు, స్త్రీలకు ఉన్నాయని అన్నారు. శిక్షణ పొందిన వారిని హెూం ట్రయాంగిల్ యప్ ద్వారా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వారి సేవలు వినియోగం కొరకు 09.01.2025వ తేదీన ఉదయం 9 గంటలకు కచ్చపి ఆడిటోరియం, తుడా ఆఫీస్ పక్కన ఈ మేళా నిర్వహిస్తున్నమని అన్నారు. పైన తెలిపిన సర్వీసులు ద్వారా శిక్షణ పొందిన వారు ఈ మేళాను సద్వినియోగ పరచుకోవాలని కమిషనర్ తెలిపారు.

మా డీకేటి భూములను పునరుద్ధరించండి

రెవెన్యూ సదస్సులో రైతులు వేడుకోలు

. రెవెన్యూ సదస్సులలో 241 ఫిర్యాదులు, 58 ఫిర్యాదులు పరిష్కారం.

విశాలాంధ్ర - రామచంద్రపురం : గత ప్రభుత్వాలలో జన్మ భూమి, ప్రజల వద్దకు పాలన, భూ పంపిణీ కార్యక్రమాల నందు పేదలకు ఇచ్చిన డీకేటి భూములను పునరుద్ధరించండని తహశీల్దార్ కె వెంకటరమణను డీకేటీ భూములు రద్దు అయిన పేద రైతులు వేడుకున్నారు. మంగళవారం మండలంలోని అనుపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును రెవెన్యూ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించిందన్నారు. అనుపల్లి పంచాయతీలో రద్దయిన డి కే డి భూములను పునరుద్ధరించడానికి స్థానిక శాసనసభ్యులు పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. మాజీ ఎంపీపీ డి బిందు మాధవి మాట్లాడుతూ గ్రామాలలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడ్డాయని, ఇది మంచి ప్రభుత్వమని కొనియాడారు. తహశీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ డిసెంబర్ 6వ తేదీ నుండి జనవరి 7వ తేదీ వరకు రెవెన్యూ గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 241 రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదుల అందాయని, వాటిలో 58 రెవెన్యూ సమస్యలను పరిష్కరించామని తెలిపారు. అనుపల్లి పంచాయతీలో భూ సర్వే నెంబర్లు పెద్ద సంఖ్యలో గవర్నమెంట్, నోషనల్ ఖాతాలో పడ్డాయని, రైతుల భూములు ఇతరుల పేరుతో ఆన్లైన్లో నమోదు అయ్యాయని ఆ సమస్యలను పరిష్కరించాలని రైతుల నుంచి 45 ఫిర్యాదులు అందాయని వాటిని రికార్డులు పరిశీలించి పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అనుపల్లి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల విశేషంగా పాల్గొని సమస్య లను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఆర్ సి పురం లో రెవెన్యూ సదస్సులు మంగళవారంతో ముగియడంతో రెవెన్యూ అధికారులు అబ్బా.రెవెన్యూ సదస్సులు ముగుసాయని ఊపిరి పీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు చేకూరి జనార్దన్ చౌదరి, అకా దేవరాజులు, పంతల వెంకటేష్ నాయుడు, బండి విజయ్ కుమార్ రెడ్డి, ఏ సిద్దయ్య, సోము,, జవాది ప్రకాష్,, బండి లీలాప్రసాద్ రెడ్డి,చిట్టిబాబు రాయల్, సర్పంచ్ గోవర్ధన్ యాదవ్, ఆర్ఐ లక్ష్మీనారాయణ, సర్వేయర్ రమేష్ బాబు, వీఆర్వోలు రాజశేఖర్, వెంకటరమణ, మల్లికార్జున్రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డైట్లో జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు

విశాలాంధ్ర-కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్) లో ఈ 8న జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ తెలిపారు. సోమవారం డైట్ కళాశాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ - చిత్తూరు-తిరుపతి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్ అలాగే ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు, కళాశాలలో 6 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనడానికి అర్హులన్నారు. జిల్లా స్థాయి రంగోత్సవ్ 2024-25 పోటీలలో 8 విభాగాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి విభాగంలోను జిల్లా స్థాయి ప్రథమ, ద్వితీయ, మరియు తృతీయ స్థానంలో నిలిచిన వారికి బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారు ఈ నెల చివరి వారంలో రాష్ట్ర స్థాయిలో జరిగే రంగోత్సవ్ పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధిస్తారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. రంగోత్సవ్ పోటీలో పాల్గొనేవారు ఏదైనా ఒక అంశంలో మారతమే పోటీ చేసుకోవాల్సి ఉంటుందని, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే వారందరికి పార్టిసిపేషన్ సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుంది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారికి ఉచిత బస్సు సౌర్యంతో పాటు, భోజన వసతులు కల్పించడం జరుగుతుందన్నారు.

అర్జీలను గడువులోగా రీ ఓపెన్ లేకుండా పరిష్కరించాలి: డిఆర్వో

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: ప్రజల నుండి అందే పీజీఆర్ఎస్, సిఎంఒ, రెవెన్యూ సదస్సులు, ఆన్లైన్ తదితర విధానాల్లో వచ్చే గ్రీవెన్స్ అర్జీలను అత్యంత ప్రాధాన్యతగా, అర్థవంతంగా సమస్యలకు పరిష్కారం చూపాలని, గ్రీవెన్స్ రీ ఓపెన్ కి తావు లేకుండా నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ పై జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు జిల్లా అధికారులతో కలిసి ప్రత్యక్షంగా,డివిజన్ ,మండల ,మున్సిపల్ అధికారులతో వర్చువల్ విధానంలో కేసు వారీగా పలు ఫిర్యాదులు సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పిజిఆర్ఎస్) లో వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యతగా, అర్థవంతంగా, నాణ్యతగా నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని, పరిష్కరించలేనివి అర్జీదారునికి స్పష్టంగా ఎండార్స్మెంట్ చేసి తెలపాలని ఆదేశించారు. రీ ఓపెన్ కి తావు లేకుండా పరిష్కారం చూపాలని అన్నారు. రెవిన్యూ సదస్సులలో ఎక్కువగా రెవెన్యూ, భూ సమస్యలపైన వస్తున్నాయని అందులో ఎక్కువగా రిసర్వే కోసం వస్తున్నాయని అలాగే ఎటువంటి అర్జీలు వచ్చిన అన్నిటిని పారష్కరించేవిధంగా ఉండాలని తెలిపారు. మండల పరిధిలో గల సర్వేయర్లు వాటికి ప్రాధాన్యతను ఇవ్వవలసినదిగా ఆదేశించారు.ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చే అర్జీలకు తక్షణమే పరిష్కారం చేయాలని తెలిపారని ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వీసీ ద్వారా అధికారులందరికి తెలిపారు. ఈనెల 10వ తారీఖు నుండి 19వ తేదీ వరకు వైకుంఠ ఏకాదశి ద్వారా దర్శనం టోకన్లు జారీ చేయు సందర్భములో పర్యవేక్షణ కొరకు సిబ్బందిని కేటాయించవలసిందిగా జిల్లా కలెక్టర్ని టిటిడి అధికారులు కోరగా భక్తుల సౌకర్యార్థం సిబ్బందిని కేటాయించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ రోస్మాండ్ తో కలసి జిల్లా అధికారులు, డివిజన్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం

ఏఐటియుసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు

విశాలాంధ్ర-తిరుపతి : ఏఐటియుసి స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని దేశవ్యాప్తంగా ఈ నెల 7వ తేదీన నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగింది అందులో భాగంగా ఈ సందర్భంగా ఏఐటియుసి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కే హేమావతి ప్రధాన కార్యదర్శి ఏ చాముండేశ్వరి లు మాట్లడుతూ ఏఐటీయూసీ పిలుపు లో భాగంగా ఆశ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త నిరసనలలో భాగంగా వినతి పత్రాలను అన్ని పీహెచ్సీలలో ఆశ డే సందర్భంగా ఇస్తున్నాము అనగిత 17 సంవత్సరాల క్రితం వయస్సు తోను చదువుతోను సంబంధం లేకుండా పట్టణాలలో గ్రామాలలో గర్భవతులకు బాలింతలకు పుట్టిన బిడ్డలకు వైద్య సేవలు అందివ్వడం కోసం ఆశాలను తీసుకోవడం జరిగింది. అయితే ఆశలకు జీతాలు పెంపు గానీ ఉద్యోగ భద్రత గాని ఎస్ఐ పిఎఫ్ సౌకర్యం గాని కనీసం కార్మికు లుగా కూడా గుర్తింపు లేదు అందుకోసం స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి దేశవ్యాప్తంగా ఈనెల 7వ తేదీ మంగళవారం నిరసన కార్యక్రమాలకు పిలుపు నివ్వడం జరిగింది ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి మా సమస్యలను తెలియజేయడం కోసం మీ ద్వారా ఈ వినతి పత్రాన్ని పంపాలని కోరుతున్నాము అని ఆశ డే జరుగుతున్న సందర్భంగా బయట నిరసన కార్యక్రమాన్ని తెలియజేసి డాక్టర్ల కు వినతి పత్రాలు సమర్పించామన్నారు. జిల్లాలో దాదాపు 40 పీహెచ్సీ పరిధిలో ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఈ కార్యక్రమంలో - రేణిగుంట గాజుల మన్యం- గొల్లపల్లి పుత్తూరు నారాయణవనం చిన్నపాండూరు వరదయ్యపాలెం శ్రీకాళహస్తి ఏర్పేడు మంగళం పాకాల దామలచెరువు కమ్మపల్లి కుప్పం బాదురు ఇంకా కొన్నిచోట్ల యొక్క కార్యక్రమం జరిగింది ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హేమావతి ప్రధాన కార్యదర్శి చాముండేశ్వరి కోశాధికారి వాణి కుమారి ధనలక్ష్మి శశిరేఖ రాజేశ్వరి లక్ష్మీ కళ అన్నపూర్ణ వెంకట రమణమ్మ మారెమ్మ మునెమ్మ జరీనా పెంచలమ్మ నాగజ్యోతి రానమ్మ ప్రసన్న రేఖ వల్లెమ్మ వసంత భాగ్యలక్ష్మి సుధారాణి నవనీత నీలావతి ప్రమీల సీత మాధవి స్వర్ణ విజయ హరిత రాధా ప్రమీల సీత అలివేలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ భజన మందిరం నిర్మాణం అడ్డుకునే ప్రయత్నం

విశాలాంధ్ర - తిరుపతి రూరల్ :వందేళ్ల క్రితం నిర్మించిన శ్రీరామ భజన మందిరం శిథిలావస్థకు చేరింది. ఎండో మెంట్ సహకారంతో నేలమట్టం చేసి నూతన మందిరాన్ని నిర్మిస్తుంటే ఆ స్థలం కబ్జా'కు ఓ కుటుంబం ప్రయత్నిస్తుందని తిరుపతి రూరల్ మండలం సీ.మల్లవరం పంచాయితీ కాలూరు గ్రామస్తులు ఆరోపించారు. మంగళవారం సాయంత్రం గ్రామస్తులు మీడియాతో మాట్లాడారు. శిథిలావస్థకు చేరుకున్న శ్రీరామ భజన మందిరాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పునః నిర్మాణం చేపడుతుంటే ప్రభుత్వ ఉద్యోగి అయిన చింతకాయల సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు, బంధువులు అడ్డుకున్నారని తెలిపారు. 30 ఏళ్ల క్రితం డాక్యుమెంట్స్ సృష్టించి కోర్టులో కేసు వేశారని పేర్కొన్నారు.అయితే కోర్టు కేసును ఎండోమెంట్'కు బదిలీ చేసిందని తెలిపారు.కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని మళ్లీ కబ్జాకు పాల్పడుతుంటే గ్రామస్తులు అడ్డుకోవడం జరిగిందన్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు ఎస్.చామీం డేశ్వరి, నీలిమ, వై.సాంబశివ లపై విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణ భయంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తే చెత్త సమస్య అంటూ కంటి తుడుపు కేసు నమోదు చేశారని ఆరోపిం చారు.ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా

అనిల్ కుమార్ యాదవ్

విశాలాంధ్ర-పలమనేరు : పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లను కల్పిం చాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బషీరాబాద్ ప్రెస్ క్లబ్ లో బీసీ సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బోను దుర్గ నరేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హాజరై ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. బీసీల అభివృద్ధికి విద్యాభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా ఎంపికైన బోను దుర్గా నరేష్, మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొని రావాలని కోరారు. అనంతరం ఏపీ బీసీ సంక్షేమ సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా కె అనిల్ కుమార్ యాదవ్ కు ఆర్ కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందించడం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా అనిల్ కుమార్ యాదవ్ ను పలువురు కలిసి శాలువా కప్పి సన్మానించారు.

కుప్పంలో పలు పరిశ్రమల పనులకు సిఎం శంకుస్థాపన

విశాలాంధ్ర – కుప్పం : ఎన్ టి ఆర్ స్టేడియం లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో స్వర్ణ కుప్పం లో భాగంగా పరిశ్రమలు పలు అభివృద్ధి పనులకు సిఎం చంద్రబాబు శంకుస్థాపనలు చేసారు. నేషనల్ డైరీ డెవలప్మెంట్ వారి చే ప్రాజెక్ట్ వ్యయం రూ. 105.10 కోట్లు తో 4800 మంది కి ఉపాధి దిశగా మదర్ డెయిరీ ఫ్రూట్ విజిటబుల్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యం లో చిత్తూరు జిల్లా శాంతి పురం మండలం, తంబిగాని పల్లి, తంబి గానిపల్లి(గ్రామం)వద్ద ఎకరాల 41.22 విస్తీర్ణంలో ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. ఫ్రూట్ పల్ప్ (మామిడి, టమోటా) తయారీ..50 వేల మంది రైతులకు ప్రయోజనం పొందేలా చర్యలు చేపడుతున్నట్లు జయ తీర్థ చారి, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ మదర్ డైరీ వారు ముఖ్య మంత్రి వివరించారు. రూ.233 కోట్ల తో 4000 మందికి ఉపాధి కల్పించే విధంగా శ్రీజ ప్రొడ్యూసర్ కంపెనీ (పాల పొడి తయారీ) కి చిత్తూరు జిల్లా శాంతి పురం మండలం తంబి గానిపల్లి,తంబి గానిపల్లి గ్రామం వద్ద 40 ఎకరాలలో ఏ పి ఐ ఐ సి ద్వారా భూమి కేటాయింపు చేశారు. ఈ ప్రాజెక్టు లో ఇప్పటికే లక్ష మంది మహిళా రైతుల భాగ స్వామ్యం కలరని సీఈఓ తిమ్మప్ప , చైర్మన్ శ్రీదేవి ముఖ్య మంత్రి కి వివరించారు. ఒక రోజు 200 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేసే సామర్థ్యం గల క్యాటిల్ ఫీడ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కు శంకుస్థాపన చేసారు. అదే విధంగా పలు ప్రారంభోత్సవాలు చేసారు. ప్రభుత్వ ప్రత్యేక నిధులు రూ.10 కోట్లు తో కుప్పం మున్సిపాలిటీ లో అర్బన్ ప్రాజెక్టుల నిర్వాహణ మరియు అధికారుల అతిథి గృహాల నిర్మాణం కోసం సమీకృత కాంప్లెక్స్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ (2 అంతస్తులు) నిర్మాణం కోసం ప్రత్యేక గ్రాంట్లు ద్వారా అంచనా వ్యయం రూ. 10.00 కోట్లు కేటాయించారు. ప్రత్యేక గ్రాంట్లు తో అంచనా వ్యయం రూ.60.20 కోట్లుతో కుప్పంలో ఏర్పాటు చేసిన డి కె పల్లి పార్కుల అభివృద్ధి మరియు సుంద రీకరణ, కుప్పం ఏరియా అభివృద్ధి లో రోడ్ల జంక్షన్లు, వీధి దీపాలు. అంచనా వ్యయం రూ. 110.21 కోట్లతో కుప్పం నియోజక వర్గంలోని 451 డ్రైనేజి వర్కులును జి ఎస్ హెచ్ 11- ఎస్ డి పి నిధుల ద్వారా చేపట్టిన పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గు మళ్ళ ప్రసాదరావు,ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి,కడ పిడి వికాస్ మర్మత్,రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ వైస్ పిఎస్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

విశాలాంధ్ర – తిరుమల కల్చరల్ :

తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 10వ తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయం వెలుపల టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో జె శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ, సాధారణంగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను పవిత్రమైన పరిమళ జలాన్ని ప్రోక్షణ చేసి, నీటితో శుభ్రంగా కడుగుతారని చెప్పారు. కాగా, స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిం చారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులుభా నుప్రకాష్ రెడ్డి, సాంబశివరావు, రాజశేఖర్ గౌడ్, సుచిత్ర యెల్లా, పనబాక లక్ష్మి, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, సి వి ఎస్ ఓ శ్రీధర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనంపై నిఘా పటిష్ఠం

అటవీశాఖతో కలసి మాస్ కూంబింగ్ ఆపరేషన్లు - పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడం

అటవీ అధికారులు సమన్వయ సమావేశంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి. శ్రీనివాస్

విశాలాంధ్ర-తిరుపతి : ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక చర్యల్లో భాగం గా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు సూచనల మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ అటవీ శాఖ అధికారులతో ప్రత్యేక సం యుక్త సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పెంచలకోన, సోమ శిల, లంకమల అటవీ ప్రాంతాలలో పర్యటించారు. పెంచలకోన, బద్వేలు, సిద్ద వటం, రైల్వే కోడూరు లలో ఈ సమావే శాలను సోమ, మంగళవారాల్లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లర్లు అక్రమ రవాణాకు ఉపయోగించే ఎంట్రీ, ఎగ్జిట్, లోడింగ్ పాయింట్లు వద్ద నిఘా పటిష్టం చేయాలని సూచించారు. అటవీశాఖ చెక్ పోస్టులలో సిబ్బంది కొరత లేకుండా, తగు మౌలిక సదుపా యాలతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. భవిష్యత్తులో టాస్క్ ఫోర్స్ అటవీ శాఖతో కలసి ప్రత్యేక మాస్ కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తా మన్నారు. పాత నేరస్తుల పై సాంకేతిక వ్యవస్థ తో నిఘా ఉంచి, నేరాలకు మళ్లీ పాల్పడితే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సమావేశాల్లో డీఎస్పీలు జి. బాలిరెడ్డి, వీ. శ్రీనివాసులు రెడ్డి, ఏసీఎఫ్ జె. శ్రీనివాస్, ఇతర టాస్క్ ఫోర్స్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

బోటు షికారుకు 35 బోట్లు

విశాలాంధ్ర – తడ : జనవరి 18 19 20 తేదీలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఫ్లెమింగో ఫెస్టివల్ 2025 నిర్వహణ నేపథ్యంలో తడ మండలం భీమునివారి పాలెం సమీపంలోని పులికాట్ సరస్సు నందు సందర్శకుల కొరకు బోటింగ్ ఏర్పాటు, వారి భద్రత తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గారితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పర్యాటకుల కొరకు బోటు షికారుకు 35 బోట్లు ఏర్పాటు చేయాలని, బోటులో ప్ర యాణించే ప్రతి ప్రయాణికునికి లైఫ్ జాకెట్ తప్పకుండా ఉండాలని, అలాగే సెక్యూరిటీ ప్రమాణాలు పాటించాలని, ప్రతి బోటుకు ఇద్దరు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలనిపర్యాటకులు బోటు షికారు కు 10 లీడింగ్ చానళ్లు ఏర్పాటు చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు ను ఆదేశించారు. పర్యాటకులు చాలామంది పులికాట్ సరస్సు నందు ఆహారం కొరకు వచ్చే ఫెలికాన్ పక్షులు, ఫ్లెమింగో తదితర పక్షులు ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేసి సందర్శకులను ఆకట్టుకుంటా యని, సందర్శకుల భద్రత ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికా రులకు సూచించారు. పలువురు స్థానికులు పలుసమ స్యలు తెలుపగా అధికారులకు కలెక్టర్ పలు సూచనలు సల హాలు చేశారు. పులికాట్ సరస్సు ఒడ్డున గల కంప చెట్లను తొలగిం చాలని అధికారులను ఆదేశించారు . బీవీ పాలెం నుండి పడవల రేవు వచ్చే రోడ్డుకు 60లక్షల రూపాయలు మంజూరు చేశామని పక్షుల పండుగ నాటికి రోడ్డు నిర్మాణం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకో వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ వైల్డ్ లైఫ్ మేనేజ్మెంట్ రాధిక, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి నారాయణ రెడ్డి, డిఎఫ్ఓ రమణయ్య సూళ్లూరుపేట సీఐ మురళీ కృష్ణ తడ తాసిల్దార్ శరత్ బాబు ఎంపీడీవో విజయ్ కుమార్ తడ ఎస్ఐ కొండప్ప నాయుడు ఎంపీపీ కొలవి రఘు స్థానిక తెలుగుదేశం నాయకులు బొమ్మన పలని బొమ్మన శ్రీధర్ బొమ్మన ఏకాంబరం, సుధాకర్, ప్రకాష్,పూడి సెల్వం, నీలకంఠం, జీవ , సుదర్శనం జయపాల్ ,భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్లు పరిశుభ్రంగా ఉంచండి

- కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర-తిరుపతి : నగరంలోని అన్నా క్యాంటీన్లు పరిశు భ్రంగా ఉంచి, నాణ్యమైన ఆహార పదార్థాలు ప్రజలకు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో స్విమ్స్ కూడలి, న్యూ బాలాజి కాలని, ముత్యాలరెడ్డి పల్లి, ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద నాలుగు అన్నా క్యాంటీన్లు నిర్వహిస్తున్న విషయం విదితమే. మంగళ వారం మధ్యాహ్నం ఈ అన్నా క్యాంటీన్లను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడి, ప్రజలకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ప్రజలకు మరుగుదొడ్లు అందుబా టులో ఉంచాలని అన్నారు. నగరపాలక సంస్థ అధికారులు, సచివాల యం సిబ్బంది ప్రతి నిత్యం అన్నా క్యాంటీన్లు పరిశీలించి ప్రజలకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని, ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని ఆ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కమిషనర్ వెంట డి.ఈ. మహేష్, సచివాలయం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

108 వాహనం సంఘటనలో

మరొక మహిళ మృతి

విశాలాంధ్ర – చంద్రగిరి: అన్నమయ్య జిల్లా రామ సముద్రం మండలానికి చెందిన గోవింద మాల వేసుకుని శ్రీవారి దర్శనానికి వెళ్తున్న భక్తులు పై సోమవారం తెల్లవారు జామున 108 వాహనం దూసుకెళ్ళిన సం ఘటలో ఇద్దరు మహిళలు మృతి చెందిన విషయం విధితమే. ఈ ప్రమా దంలో గాయపడి ఆరోగ్యం విషమంగా ఉండిన రామసముద్రం మండలం చింపరపల్లి గ్రామానికి చెందిన ఎన్. రమణారెడ్డి భార్య ఎన్.తులసమ్మ – 40 సం.లు మంగళ వారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో ఈ ప్రమాదంలో మృ తుల సంఖ్య మూడుకు చేరింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.